నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 18 మే 2024 | BHADRADRI KOTHAGUDEM

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి.. మరో నయీమ్

- అలాంటి వాళ్లకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలి
- మన రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్‌దే..
- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో 'రేగా'

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మే 17: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వస్తున్నది బ్లాక్ మెయిలర్, చీటర్ అయిన తీన్మార్ మల్లన్న అని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. అతడు మరో నయీమ్ అని విమర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మణుగూరు కిన్నెర కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా శ్రమించి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బ్లాక్ మెయిలర్లకు బుద్ధి చెప్పాలంటే బీఆర్ఎస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. మన రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుక కేవలం బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. అనంతరం పినపాక మండలం బీఆర్ఎస్ కార్యకర్త చిట్టిమల్ల సురేశ్ ప్రమాదశాత్తూ మరణించడంతో బాధిత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల పార్టీ ప్రమాద బీమా చెక్కును, గనిబోయిన గుంపులో నీటి తొట్టిలో పడి మృతి చెందిన బాలుడి కుటుంబానికి రేగా విష్ణు చారి టబుల్ ట్రస్ట్ నుంచి రూ.50 వేల సాయాన్ని అందజేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. బీఆర్ఎస్‌కు ప్రత్యేక లీగల్ సెల్ ఉందని, ఏ కార్యకర్తా అధైర్యపడొద్దని అన్నారు. నాయకులు కోలేటి భవానీశంకర్, పోశం నర్సింహారావు, సతీశ్‌రెడ్డి, ముత్యంబాబు, వట్టం రాంబాబు, అమరేందర్, నాగెల్లి వెంకట్, గాంధీ, సకిని బాబురావు, కుర్రి నాగేశ్వరరావు, ముద్దంగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, వేదికపై ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

- ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదు
- అధికార పార్టీకి ఒత్తాసు పలికే తీన్మార్ మల్లన్నకు ఓటు వేయవద్దు
- గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి
- ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డినే గెలిపిద్దాం: తాతా మధు

ఖమ్మం, మే 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మీలో ఒక్కడిగా, మీ అందరి ప్రతినిధిగా ఉంటూ మీ గళాన్ని శాసన మండలిలో వినిపించడానికి ఈ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి కోరారు. ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై ఈ ప్రభుత్వానికి పట్టింపులేదని విమర్శించారు. అధికార పార్టీకి ఒత్తాసు పలికే తీన్మార్ మల్లన్నకు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణభవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నిక అనేది చాలా ముఖ్యమైనదని అన్నారు. విద్యావంతులు, మేధావులంతా కలిసి సమాజానికి ఉపయోగపడే వారిని ఎన్నుకుంటారని అన్నారు. అందుకని ఈ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని ఆదరించాలని, ప్రశ్నించేవారిని తిరస్కరించాలని కోరారు. తనది ప్రశ్నించే గొంతుక అంటున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న.. నిరుద్యోగభృతి, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ వంటి వాటిపై ఎందుకు ప్రశ్నించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పట్టభద్రుల నియోజకవర్గంలో ఈసారి కూడా గులాబీ జెండా ఎగరబోతోందని స్పష్టం చేశారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.

మల్లన్న.. ఓ చీడపురుగు: తాతా మధు

ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ.. సామాజిక సేవాగుణం ఉండి రాజకీయాల్లోకి వచ్చిన మంచి వ్యక్తి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అని అన్నారు. ఇలాంటి వ్యక్తికే చట్టసభల్లో కూర్చునే అర్హత ఉందని అన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, విద్యావంతులు విజ్ఞతతో ఆలోచించాలని.. హక్కుల కోసం పోరాడే రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అమెరికాలో పనిచేస్తున్న ఆయన.. దేశానికి సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి చూసి బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు. తెలంగాణ సమాజానికి పట్టిన చీడపురుగుల్లో ఒక పురుగు కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అని విమర్శించారు. చైతన్యవంతులైన ఖమ్మం జిలా ప్రజలు ఈ గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో మల్లన్నను ఓడించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, బిచ్చాల తిరుమలరావు, పగడాల నాగరాజు, శీలంశెట్టి వీరభద్రం, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, ముత్యాల వెంకట అప్పారావు, సతీశ్, ఆసిఫ్ హైమద్ సయ్యద్, బురఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్

వైరాటౌన్, మే 17 : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉన్నదని, ఇందు కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ కోరారు. రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైరా నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులు గడుస్తున్నా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగడం లేదన్నారు. గత కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రైతులు, పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. పట్టభద్రులు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి ఓట్లు వేసే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు ఖాయమని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా..

- గ్రాడ్యుయేట్లు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి
- వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు

ఖమ్మం, మే 17 : బీఆర్ఎస్ తరపున కేసీఆర్ ఆశీస్సులతో ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే శాసనమండలిలో ప్రజా గొంతుకనై ప్రశ్నిస్తానని అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి రాకేశ్‌రెడ్డి నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం, ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ గతంలో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, రాజు, రామచందర్‌రావు, డాక్టర్ నాగేశ్వరరావు, దిలీప్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి లాంటి మేధావులు ఎన్నికయ్యారని గుర్తు చేశారు. ఈసారి కూడా అదే పరంపర కొనసాగుతుందని భావిస్తున్నానన్నారు. తాను బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఏడేళ్లు అమెరికాలో ఉండి కన్న భూమి రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో 2013లో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తనకు అందరి సమస్యలపై అవగాహన ఉన్నదని, అందుకే ప్రభుత్వాన్ని ప్రశ్నించగలుగుతానని అన్నారు. తనను గెలిపిస్తే ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన వారి గొంతుకలా పోరాడుతానని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ జిల్లా ఓటర్లు, ప్రజలు చాలా చైతన్యవంతులని, పట్టభద్రుల నియోజకవర్గంలోని ఓటర్లు అందరూ విజ్ఞతతో ఆలోచించి అభ్యర్థిని ఎన్నుకోవాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న ఒక బ్లాక్ మెయిలర్ అని, అతడికి ఓటు వేయడం వ్యర్థమని అన్నారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు, అనేక జిల్లాలకు చెందిన రియల్ వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బిల్డర్‌లను బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తి అని, అలాంటి వ్యక్తులను ఎన్నుకుంటే మండలి పరువు పోతుందన్నారు. అనంతరం స్టేడియంలోని జిమ్‌లో జిమ్ చేసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సమన్వయకర్తలు ఆర్జేసీ కృష్ణ, బిచ్చాల తిరుమలరావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, మోతారపు సుధాకర్, కార్పొరేటర్ బుడిగెం శ్రీను, శీలంశెట్టి వీరభద్రం, మేకల సుగుణారావు పాల్గొన్నారు.

వాకర్స్‌తో మాట్లాడి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, తాతా మధు తదితరులు

మౌలిక వసతుల పనులు పూర్తి చేయండి

వీసీలో సీఎస్ శాంతికుమారి

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 17 (నమస్తే తెలంగాణ)/మామిళ్లగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతులు, మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే చేపట్టిన అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, కొత్తగూడెం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రియాంక ఆల, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి పాల్గొన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, ప్రభుత్వ సిబ్బంది పోషించిన పాత్రను అభినందించారు. అనంతరం కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక ఆల మాట్లాడుతూ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలైన టాయిలెట్లు, తాగునీరు, చిన్నచిన్న మరమ్మతు పనులు పూర్తి చేస్తున్నామని, చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. పాఠశాలల పునః ప్రారంభంలోగా పనులన్నీ పూర్తవుతాయని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి, సకాలంలో రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ జరుగుతున్నదని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా జిల్లాల అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, డీఆర్వో రాజేశ్వరి, డీఆర్డీఓ సన్యాసయ్య, ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, డీసీవో రుక్మిణి, వ్యవసాయ శాఖ అధికారులు విజయనిర్మల, బాబురావు, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, డీఎం సివిల్ సప్లై త్రినాథ్‌బాబు, డీసీవో సయ్యద్ ఖుర్షీద్, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, ఎస్ఈలు చంద్రమౌళి, శ్యాంప్రసాద్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరుస్లిప్‌ల పంపిణీ పూర్తి చేయాలి

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మే 17 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించిన ఓటరు స్లిప్పుల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుకు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలియాల్సిన అవసరం ఉందని, ప్రతి ఓటరుకు స్లిప్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్‌స్లిప్‌ల పంపిణీ సంబంధిత బీఎల్‌వో ద్వారా చేపట్టాలని, ప్రతిరోజు సాయంత్రం 6గంటలకు పంపిణీ పురోగతిపై నివేదిక సమర్పించాలని అన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయాలని, ఏవేని చిన్న చిన్న మరమ్మతులు ఉంటే, వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి విడత శిక్షణ ఈ నెల 20న, రెండోవిడత శిక్షణ ఈ నెల 26న ఉంటుందని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కోసం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 26న డిస్ట్రిబ్యూషన్ కేం ద్రం నుంచి పోలింగ్ సామగ్రి తీసుకొని, సంబంధిత పోలింగ్ కేంద్రానికి వెళ్లి, అక్కడే బస చేయాలన్నారు. రిసెప్షన్ కేంద్రం నల్గొండలోని నాగార్జున కళాశాలలో ఉంటుందని, ఈ నెల 27న పోలింగ్ నేరుగా రిసెప్షన్ కేంద్రానికి పోలీస్ ఎస్కార్ట్‌తో వెళ్లాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 15 రూట్లు, ప్రతి రూటుకు రూట్ ఆఫీసర్‌ని నియమించామన్నారు. తహసీల్దార్లు సెక్టార్ అధికారులుగా, నయాబ్ తహసీల్దార్లు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా, ఆర్ఐలు ప్రత్యేక వీడియో టీమ్‌లుగా నియమించినట్లు తెలిపారు. శుక్రవారం నుంచే విధుల నిర్వహణ చేపట్టాలని అన్నారు. ప్రత్యేక వీడియోటీమ్‌కు వీడియోగ్రాఫర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్, ఆర్డీవోలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని అన్నారు. ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చేపట్టాలని, ఓటింగ్ విధానం, చేయదగినవి, చేయకూడని పనులపై ఫ్లెక్సీ రూపొందించి, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించాలన్నారు. అదేవిధంగా ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. ప్రతిరోజు తహసీల్దార్ కనీసం 20 ఫైళ్లు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్లలో పెండింగ్ స్లాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డీఆర్డీవో ఎం.రాజేశ్వరి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, అనురాధబాయి, రాంబాబు, సత్యనారాయణ, ఓఎస్డీ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

బోనస్‌పై మాట మార్చిన కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందు, మే 17 : శాసనసభ ఎన్నికలకు ముందు వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే మాట మార్చిందని, రైతులను ముంచడమే పనిగా పెట్టుకున్నదని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. అన్ని రకాల పంటలకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ కేవలం సన్నరకం ధాన్యానికే బోనస్ ఇస్తామనడం ఎంతవరకు సబబు అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 80 శాతం మంది రైతులు దొడ్డు రకం వరి వేస్తారని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో ఆ రైతులందరికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం అన్ని రకాల వరి పంటలకు బోనస్ ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్, నాయకులు లక్కినేని సురేందర్, సిలివేరి సత్యనారాయణ, తాత గణేశ్, సత్యనారాయణ, వరప్రసాద్, ప్రమోద్, లక్ష్మణ్‌నాయక్, అచ్చయ్య, కృష్ణప్రసాద్, పరుచూరి వెంకటేశ్వర్లు, రేణుక, శారద, మంగమ్మ, ఘాజీ, సరిత, జబ్బార్, గిన్నారపు రాజేశ్, హరికృష్ణ, నబి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ

బాలల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 17 (నమస్తే తెలంగాణ) : బాలల హక్కులు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. బాలల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల చట్టాల అమలు వంటి అంశాల్లో తీసుకుంటున్న చర్యలపై జిల్లా సంక్షేమ, మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా బాలలకు రక్షణ కల్పించామన్నారు. బాలల భద్రత, శ్రేయస్సుకు సంబంధించి ప్రభావితం చేసే సమస్యలపై కమిటీ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో విద్యాచందన, డీడబ్ల్యూవో విజేత, ఎస్సీ సంక్షేమాధికారి అనసూయ, బీసీ సంక్షేమాధికారి ఇందిర, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షర్ఫుద్దీన్, సంక్షేమ సమితి సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షల నిర్వహణ
- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం, మే 17 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం ఐడీవోసీలోని తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రథమ సంవత్సరం 5,408 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 2,726 మంది రాయనున్నారని తెలిపారు. సమీక్షలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, జిల్లా వైద్య శాఖ అధికారి శిరీష, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడంచెల భద్రతతో నిఘా

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ సునీల్ దత్

ఖమ్మం రూరల్, మే 17 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసి.. నిరంతర నిఘా పెట్టామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల భవనంలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నలువైపులా కేంద్ర పోలీస్ బలగాలు, ఆర్మ్డ్ పోలీస్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతతోపాటు నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తూ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ పి.మౌనిక, రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.